# ఆకాంక్షల గేహం

## వి.కె. శైలజ

యూనివర్సిటీ క్యాంపస్, ఆర్ట్స్ కాలేజ్ పక్కనున్న క్యాంటీన్...

సాయంత్రం ఐదున్నర.

రెండు కప్పుల్లో టీ తెచ్చాడు వినీత్ పొగలు కక్కే వేడి, వేడి టీ....

అల్లం, యాలకుల సమ్మిళితపు పరిమళాల టీ అంటే చాలా ఇష్టం దేవికకి. అయినా కన్నెత్తి చూళ్లేదు.

"దేవీ..." పిల్చాడు వినీత్.

... ....

జవాబు లేదు.

"నీ కోసం, నీకు ఇష్టమని స్పెషల్‌గా చేయించానీ టీ ని..."

"సారీ..." కప్పు అందుకొంది.

"మనసు బాగోలేదా?"

జవాబు చెప్పలా. ఒక్క క్షణం పాటు కళ్లెత్తి చూసి తిరిగి టీ సిప్ చేస్తోంది.

"టేకిట్ ఈజీ... ఇది చివరి ఛాయిస్ కాదు కదా... మరో రెండు ఛాన్సులు న్నాయి. మొదటి సారికే ఇంతగా డీలాపడి పోతే ఎలా మైడియర్...టేకిట్ ఈజీ...."

అయినా దేవికలో ఉత్సాహపు కదలిక లేదు.

"ఈ డిప్రెషన్ పోవాలంటే ఒకటే మార్గం..."

మళ్లీ చూసింది కళ్లెత్తి....

"మనసును కదిలించి వేసే సినిమా చూడాలి...

నీ మెస్ ఎనిమిదిగంటలకు పూర్తవుతుంది కదా... ఆ వెంటనే బయటకు వచ్చెయి. నేను మీ హాస్టల్ గేటు దగ్గర ఎదురు చూస్తుంటాను.... టైటానిక్‌కి వెళ్దాం.... ఒకే రైట్...."

ఖాళీకప్ టేబిల్ మీద పెట్టేసి లేచి నిల్చున్నాడు వినీత్. దేవిక కూడా టీ తాగడం పూర్తి చేసింది. అయినా అలాగే కూర్చునుంది....

"ఏమిటీ వెళ్లొద్దా?"

చాలా సేపటి తర్వాత మాట్లాడ్డం ప్రారంభించింది....

"నీకు..నీకు ఏమీ అనిపించడం లేదా వినీత్? ఏడుపు మొహం పెట్టుకుని కూర్చుంటే పాడయిన పేపర్ తిరిగి రాసే అవకాశం వస్తుందని నేను అనను. ఎట్ లీస్ట్ మన కలలన్నీ ఇలా మొదటి ప్రయత్నంలోనే నేలకూలాయే అని బాధ కూడా అన్పించడం లేదా?

జ్ఞాపకం ఉందా....యుపిపిఎస్‌సి అప్లికేషన్ ఫిలప్ చేసి పోస్ట్ చేసిన రోజు ఎంత ఎక్సయిట్‌మెంటు? ఫస్ట్ ఎటెంప్టుతో ప్రిలిమినరీ అయిపోతుందనీ, ఫైనల్‌కి ఒక ఛాన్సు తీసుకున్నాం......"

"ఓహ్ దేవికా..."విసుగ్గా మొహం పెట్టాడు వినీత్- మళ్లీ అతనే

"నిజమే ఒక టన్ను కలలుగన్నాం. ఎగ్రీయింగ్ విత్‌యూ...కానీ- అయిపోయింది కదా? అయిపోయిందాని గురించి మళ్లీ మళ్లీ బాధపడటమెందుకు? జస్ట్ టేకిట్ ఈజీ. నువ్వొచ్చినా రాకపోయినా ఈ రాత్రికి టైటానిక్ చూడాల్సిందే-నువ్వొస్తే....ఇటీజ్ క్వయిట్ ఇంటరెస్టింగ్- వస్తావా రావా?!"

దేవిక ఔననలేదు. కాదనలేదు...

బైక్ స్టార్ట్ చేసి - ఆ అమ్మాయికోసం చూస్తున్నాడు. దేవికకి కాన్సస్ ఒప్పుకోవడం లేదు....వెళ్లాలనిపించడం లేదు.

రెయిజ్ చేసిన వినీత్ బండి ఆగి స్టాండ్ మీద నిలబడింది. అతను బండిదిగి దేవిక దగ్గరకొచ్చి పక్కన కూర్చుని "దేవీ.... ఐసెడ్...ప్లీజ్ టేక్ ఇట్ ఈజీ..."

*****

"కంగ్రాట్స్ మైడియర్ డార్లింగ్...

పేపరుపోయింది-

లీడ్ చేయనన్నావ్...

పాసయిపోయావ్...

చెప్పు ఎక్కడ పార్టీ ఇవ్వను?



వైశ్రాయ్-

కాకతీ....య..."

ఆగిపోయాడు వినీత్.

దేవిక కళ్లలో వెలుగు లేదు.

పెదవులపై నవ్వు లేదు.

మొహంలో ఆనందం లేదు-

"ఏమయింది దేవి, పాసయ్యావు, యు మస్ట్ బి వెరీ చీర్‌పుల్..... ప్లీజ్ బి కంఫర్టబుల్"

దేవిక నవ్వలేదు.

"వినీత్- నీకు, నీకేమీ అన్పించడం లేదా?"

"ఏ విషయం...?!"

"నేను మాత్రమే పాసయ్యేనని కాదు- ఇద్దరం కలిసి రాశాం- కానీ ఒకరమే పాసయ్యేము..."

ఆగి వినీత్ మొహాన్ని పరీక్షగా చూసింది.

వినీత్ మొహంలో-

స్వర్ణామాత్రంగా కూడా కొత్తభావమూ- బాధా ఏమీ లేవు-

"వినీత్ నిజంగా చెప్పు నువ్వేమీ ఫీలవడం లేదా?"

"నో...నో....నెవ్వర్. టేకిట్ ఈజీ యార్- రాత్రింబవళ్లు కళ్లు ఉబ్బిపోయేలా కష్టపడి చదివింది నువ్వు, పాసయింది నువ్వు-

నిన్ను కౌగిలించుకుని వెచ్చగా పడుకున్నట్లు పగటికలలు కంటూ షికార్లు చేసింది నేను - పాసవ్వంది నేను అలాంటి నేనేమనుకుంటాను-

నా గురించి నువ్వేమీ వర్రీ అవ్వబోకు- టేకిట్ ఈజీ...."

*****

"టేకిట్ ఈజీ. టేకిట్ ఈజీ....

ఇద్దరం ఒకేసారి ప్రారంభించేం.

ఏది నువ్వు ప్రిలిమ్స్‌లోనే ఉన్నావ్. నేను ప్రిలిమ్స్ కంప్లీట్ చేశాను. ఫైనల్ కూడా అయిపోయింది. ఇంటర్వ్యూకి వెళ్లబోతున్నాను. నీకు నీకేమీ అనిపించదా?"

"ఏమనీ...?"

"ఫూల్‌లా అదే ప్రశ్న....అదే మొహం.

ధ్యేయాలు, సిద్ధాంతాలు నిన్నేమీ వెంటాడవా?"

"దేవీ నాకో విషయం అర్థం కావడం లేదు. ఈ ఐఎఎస్ పరీక్షలేమయినా జీవన్మరణ సమస్యలా?"

"మరి...?!" ఆశ్చర్యపోతూ చూసింది-

"నాన్సెన్స్!

ఈ డిగ్రీలు, సర్టిఫికేట్లు, కాంపిటీటివ్ పరీక్షలు కడుపు నింపుతాయ నే నమ్మకం నాకెప్పుడూ లేదు. ఈవెన్ ఐ డోంట్ కేర్ ఇట్.

నువ్వు ఐఎఎస్ అన్నావ్- సర్లే చూద్దాం అనుకున్నాను. కానీ గంటలు గంటలు కూర్చుని చదవడం - నోట్సులు ప్రిపేరు చేయడం....క్వాలిటీ టెస్టులు రాయడం, జీవితాన్నీ ఆనందాల్నీ విలాసాల్నీ ఫణం గా పెట్టి పోస్టింగ్ తెచ్చుకుంటే- ఎంత వో పది పదిహేనువేలు అంతేగా వచ్చేది?"

"డబ్బు మాత్రమేనా?"

"చివరి అంశం డబ్బేగా?"

"పోని జీతం లేకుండా పనిచేయగలవా?"

"ఎవ్వరు ఔనన్నా- కాదన్నా డబ్బు సంపాదించడానికి మించిన సక్సెస్ మరేమీ లేదు...ఉండబోదు. చూస్తూండు- నువ్వు ఇంటర్వ్యూలో సెలెక్టు అయి నీ ట్రయినింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చేటప్పటికి నేను కారులో వస్తాను- నిన్ను తీసుకురావడానికి- నవ్వవద్దు. ఒక్కపూట ఛేంజ్‌కోసం యూనివర్శిటీ మెస్ కాదనుకుని హోటల్‌లో భోంచేయాలంటే పర్సు చూసుకోవాలి- వీడికి కారేమిటా అని. నువ్వు మర్చిపోకూడని విషయం ఒకటుంది నేను ఎల్ఎల్‌బి చేశాననీ. మావూరు దగ్గరున్న స్పిన్నింగ్ మిల్లు వర్కర్స్ యూనియన్‌కి ప్రెసిడెంటు

నీ" నవ్వాడు వినీత్.

ఆ నవ్వులో చాలా అర్థాలున్నాయ్.

"ఈ వాదనలు ప్రస్తుతానికి చాలు... దేవీ- నేనెప్పుడూ చెప్పేమాట ఒకటే- టేకిట్ ఈజీ! అని! నా పాలసీ కూడా అదే!!

రాత్రిళ్లు నిద్రపాడు చేసుకుని ఆలోచిస్తూ కూర్చోబోకు -

అందాల నీ కళ్లు సోయగాలు కోల్పోతే నే చూడలేను..."

చూపుడు వేలితో చెక్కిలిమీద చిటికెన వేసి-

వెళ్లిపోయాడు వినీత్-

అలాగే చూస్తుండిపోయింది దేవిక-

కొత్తగా ఉన్నాడు వినీత్-

ఇవ్వాళ మరింత కొత్తగా ఉన్నాడు

అర్థం కానంత కొత్తగా ఉన్నాడు

అర్థం చేసుకోలేనంత కొత్తగా ఉన్నాడు.

టేకిట్ ఈ...జీ?!

*****

"నీకు కాఫీయా టీ నా...?!"

"అల్లం వేసి చేసిన టీ ఇష్టం..."

"ఇతను చేసివ్వగలడా?"

"గ...ల...డా?!

హౌడేర్.... నథింగ్ డూయింగ్. చేసివ్వాలంతే!

ఇది నాదేవి కోరిక, కాదంటే వాడి తల వెయ్యిముక్కలు, లక్షచెక్కలు అవుతుంది..."

నవ్వుతూ టీ చేస్తున్న కుర్రాడి దగ్గరికెళ్లి ఐదునిమిషాల్లో రెండుకప్పులతో వచ్చాడు వినీత్-

కమ్మని అద్రక్ ఛాయ్- రెండు కప్పుల్లోనూ-

"టీ ఏమిటీ నువ్వు కాఫీకదా తాగుతావ్-"

"ఇవ్వాళ్టినుంచీ నీ ఇష్టాలే నా యిష్టాలు...

నాకు స్ట్రాంగ్ కాఫీ ఇష్టం...

కాని ఇక టీ తాగడాన్నే ఇష్టం చేసుకుంటాను-"

"నా ఇష్టాలన్నిటినీ నువ్వు ఇష్టాలుగా మార్చుకోవడం చాలా కష్టం వినీత్..."

"నెవ్వర్...ఐయామ్ స్ట్రాంగ్ ఎట్ విల్..."

"నీకో విషయం చెప్పనా...?!"

మాట్లాడ్డం ప్రారంభించింది దేవిక....

"నాకు తెలిసినంతలో మా వంశంలో పీజీ చేసిన వాళ్లెవరూ లేరు. స్కూలు ఫైనల్ వరకు చదివిన వాళ్లు కూడా లేరనుకుంటాను. ఆడపిల్లలు చదువుకోవడమంటే అదుపు తప్పిపోవడమనేది- మా వాళ్ల అభిప్రాయం.

అయినా పోరాడి చదువుకుంటున్నాను.

రేప్పొద్దున మన పెళ్లికీ అంతే.... పోరాటం తప్పదు.

అయినా గెలుస్తాను. నాకా నమ్మకం ఉంది.

అయితే నాక్కావాల్సిందేమిటో తెలుసా-"

.... ....

క్షణం ఆగింది-

ఒక జీవితకాలపు ఆకాంక్షల్ని, ఆశయాలని మరోసారి కళ్లముందు సాక్షాత్కరింపజేసుకోవడాని కన్నట్టు-

"అతి మామూలు జీవితం కాదు-

అందరూ కలలుగనే జీవితాన్ని సాధ్యం చేసుకోవాలి.

నాకు ఐఎయస్‌ని అవ్వాలని ఉంది-

ఇది నిన్నా- మొన్నా హఠాత్తుగా పుట్టుకొచ్చిన గ్లామరస్ కోరిక కాదు-

స్కూలు ఫైనల్‌లో ఉండగానే జరిగిపోయిన నిర్ణయం-

సాధారణంగా ఆర్ట్స్ లాంటి గ్రూపుల్లో ఎవ్వరూ గెయిన్ చేయని మార్క్స్‌ని నేను గెయిన్ చేశాను.

డిగ్రీలోనూ అంతే...

పీజీ గోల్డ్‌మెడలిస్ట్‌ని-

ఐఎయస్ మన స్థాయినీ, జీవనసరళినీ ఆర్థికంగా ఉన్నతమయినస్థితిని అందించగలిగే అర్హతే కాదు -

ఒక సాంఘిక బాధ్యతని పొందాగా నిర్వర్తించగలిగే అవకాశాన్నిస్తుంది...

కలల్నీ...కోరికల్నీ,అవకాశాల్నీ బాధ్యతల్నీ అన్నిటిని ఏకం చేసి హారతి పళ్లెంలో పెట్టి అందించే అవకాశం- ఐఎయస్ మాత్రమే కల్పిస్తుందని నా ప్రగాఢ విశ్వాసం..."

ఒక ప్రవాహంలా చెప్పుకొస్తూ హఠాత్తుగా ఆగి-

"చెప్పు వినీత్-

ఇది కాఫీ కాదు-

ఐఎయస్...!

కాఫీ మార్చి టీని అలవాటు చేసుకున్నంత ఈజీగా లా ప్రాక్టీసునుంచి ఐఎయస్ లోకి మారలేవు.

అయినా నేను కోరేది ఒక్కటే-

నా ఆశయమూ ఆశా...ఆకాంక్ష...

ఒక్కటే-

మనిద్దరం ఐఎఎస్ అవ్వాలి...

"ఓ యస్ దానేముంది...నా ఎల్‌ఎల్‌బి కూడా అయిపోయింది. నౌ ఐయామ్ ఫ్రీ"- క్షణకాలంకూడా యోచన కూడా లేకుండా జవాబు చెప్పేశాడు వినీత్-

నవ్వింది దేవిక-

"ఏమిటి నవ్వుతావ్?"

"ఎల్‌ఎల్‌బి అయిపోయింది. నేనిప్పుడు ఫ్రీయే అంటోంటే...."


"అయితే?"

"ఇదేవీ స్టాప్ గ్యాప్ కోర్సు కాదు వినీత్ బాబు....

మూడక్షరాల ఆ అర్హతని సొంతం చేసుకోవడానికి ఈ వయస్సులో మనకు అత్యంత ప్రియాతి ప్రియమయిన టెంపర్‌మెంట్స్‌నీ, టెంప్టేషన్స్‌నీ ఫణంగా పెట్టాలి...

నీకు అర్ధరాత్రి వరకూ స్నేహితుల్తో షికార్లిష్టం- టూర్లిష్టం...సినిమాలిష్టం...నిద్ర ఇష్టం...."

"నిద్రలో దేవి జోలపాడ్తోన్నట్టు కలగనటం ఇష్టం...."



"స్టుపిడ్ "-చేతిలో బుక్‌తో కొట్టింది.

"వినీత్ ప్లీజ్ బి సీరియస్....

నేను ఆషామాషీగా మాట్లాడ్డం లేదు. మనకు ఒకరంటే ఒకరికి ప్రాణమంత ఇష్టం....నువ్వు లేకుండా నా జీవితాన్ని వూహించలేను

అలాగే-

రసహీనంగా ధ్యేయాల్నీ కలల్నీ ఆశయాల్నీ నిజం చేసుకోలేని రాజీల అతుకుల బతుకుని కూడా స్వీకరించలేను

చదువుదాం-

మామూలు మనుషులు- కేవలం మనలాంటి కలల బేహారులు

ఆశలసౌధాల్ని సొంతం చేసుకోవాలంటే-మనకున్న అత్యున్నత అవకాశమిది....ఏమంటావ్?"

ఆగింది దేవిక-

కళ్లింత చేసుకుని దేవికనే చూస్తున్నాడు వినీత్-

"నేనేమీ దెయ్యాన్ని కాదు, అలా భయపడిపోయి చూడ్డానికి...."

"భయం కాదు...ఆశ్చర్యం-

సన్నజాజితీగలా లలిత-లలితంగా ముగ్ధమోహనంగా ఉండే ఈ అమ్మాయిలో ఇంత బలమయిన ఆత్మవిశ్వాసం ఎక్కడ దాగుందా అని- ఆశ్చర్యపోతున్నాను

దేవీ....నీ ఆశయమే నాదీనూ....

చదువుదాం ...

కలసి కలలసౌధాన్ని సొంతం చేసుకొందాం... నీ కోసం నేనేం చేయడానికయినా సిద్ధమే, మనసు పాడు చేసుకోకు. టేకిట్ ఈజీ...."

*****

నిజమే టేకిట్ ఈజీ-

దాదాపు సంవత్సరం క్రితం టేకిట్ ఈజీ అంటూ వొప్పేసుకున్నాడు.

ఏం జరిగింది?

రెండుసార్లు ప్రిలిమినరీ రాశాడు....

పాసవలేదు.

'ఏమి అనిపించడం లేదా' అంటే 'టేకిట్ ఈజీ...' అంటాడు.

ఎంత మామూలుగా అంటాడు?

పైగా ప్రాణంలా ప్రేమిస్తున్నానంటాడు

ప్రాణంలాంటి ప్రేమకి-

ఆకాంక్షలు, ఆశయాలు ఉండవా?

జీవితానికి నిబద్ధత- నైతిక బాధ్యతలు అవసరం లేదా?

అన్ని మార్గాలు డబ్బు వైపే దారి తీస్తాయా?

అక్రమంగానో అన్యాయంగానో సంపాదించడమొకటేనా?

కాఫీ నుంచి టీ లోకి-

ఎల్‌ఎల్‌బి నుంచి ఐఎఎస్‌లోకి...

అన్నీ - అన్నీ టేకిట్ ఈజీయేనా....?!

*****

లేడీస్ హాస్టల్ దగ్గర సూట్‌కేసుతో నిల్చునుంచి దేవి-

పక్కన నలుగురు ముగ్గురు అమ్మాయిలు బహుశ-క్లాస్‌మేట్స్ అనుకుంటాను-

వినీత్ బైక్ వచ్చి ఆగింది-

"హాయ్..."

గుంపులోంచీ ఎవరో పలకరించారు.

కానీ ఆగొంతు దేవికది కాదు....

ఆ విషయం వెంటనే అర్థమయింది- వినీత్‌కి-

"దేవీ- నీతో మాట్లాడాలి...."

చుట్టూ దేవిక స్నేహితులు...

వాళ్లందరికీ దేవికా-వినీత్ కాబోయే భార్యాభర్తలుగా- తెలుసు. అంతేగానీ ఈ గ్యాప్ తెలీదు.

ఇప్పుడు తెలిసిపోతుందేమోననే భయం ఇద్దరిలోనూ లేదు....

తల తిప్పుకుంది దేవిక.

"దేవీ ఐవాంట్ టు టాక్ విత్ యు ప్లీజ్...."

"ఆటో...."

వినీత్ మాటల్ని పట్టించుకోకుండా వెళ్తున్న ఆటోని పిల్చింది-

"దేవీ...ఆల్ ది బెస్ట్...." ఫ్రెండ్స్ చెబుతున్నారు.

"థాంక్యూ..." చెప్పింది దేవిక.


ఆ మొహంలో ఎలాంటి భావాల్లేవ్... ఎడారిలా ఉంది. సూట్‌కేసు అందుకుని- ఆటో వైపు నడిచింది-

వినీత్ బండిదిగి దేవిక వెనకే ఆటో దగ్గరకెళ్లాడు...

దేవిక సూట్‌కేసు ఆటోలో పెట్టి తనూ కూర్చుంది....

"నేనూ ఢిల్లీ వస్తున్నాను.

(తరువాయి 19వ పేజీలో)



# వెలుగు చూడని ఎర్రజార గుహ

కర్నూలు జిల్లాలో యాగంటి క్షేత్రం - బనగానపల్లెకు వాయువ్యంగా పాతపాటుకు పదికిలోమీటర్ల దూరాన ఉంటుంది. యాగంటికి దక్షిణ చరియకు ఇవతలి కోనలో కొండకు సగం ఎత్తులో, అరవై మీటర్ల ఎత్తున గల విశాలమయిన సున్నపు రాతి శిలలదిగువన...'ఎర్రజార' అనే అద్భుతమయిన గుహ ఉంది. దీనిని చేరడం అంత సులభం కాదు. ఏటవాలుగా ఉండే కొండశిలలను దాటుకుంటూ వెళ్లడం శ్రమే. అయినా గుహను చేరాక ఆ శ్రమంతా మర్చిపోతాం.

గుహ ముఖం పదిమీటర్ల ఎత్తు, ఏడు మీటర్ల వెడల్పుతో తీర్చిదిద్దినట్టు ఉంటుంది. లోపలకు అడుగుపెట్టగానే ప్రత్యక్షమయ్యే హాలు అబ్బురపరుస్తుంది. అసలు ఇందులో అడుగిడగానే ఎంతో మహత్తుగల ఆలయంలోకి ప్రవేశించినప్పుడు కలిగే అనుభూతి కలుగుతుంది.

గుహలో ముందుహాలుకు కుడివైపున ఉత్తరదిశగా మరోహాలు, దాని తర్వాత గుండ్రని కూడలి ఉండి అక్కడికి శిధిలమయిన కుడ్యాల నుండి ధారాళంగా వెలుతురు ప్రసరిస్తుంది. అక్కడి నుండి ఎడమ వైపునకు తిరిగితే దాదాపు నలభై మీటర్ల పొడవుండే ఒక కారిడారు ప్రత్యక్షమవుతుంది. దీనికి అనుబంధంగా చిన్న- చిన్న గదులున్నాయి. చిన్నగదులు, ముఖద్వారాన్ని పలకరిస్తున్నట్టుండే విశాలమయిన హాలు...దీనికి కుడి, ఎడమల వైపున మరో రెండు హాళ్లతో ఈ గుహ అందంగానే కాదు...ఎంతో విశాలంగాను ఉంటుంది. ఎన్నో శతాబ్దాల చరిత్ర ఉన్నట్టుండే ఈ గుహ... 'సాంస్కృతిక' వారసత్వానికి ఒక చిరునామాలా కనిపిస్తుంది.

దీని రక్షణకు భారత ఆర్కియాలజీ డిపార్టుమేంటుగానీ, కర్నూలు కలెక్టరు గానీ ఎలాంటి శ్రద్ధ కనబర్చడం లేదు. అయితే ఈ మధ్యనే రాష్ట్రఆర్కియాలజీ డిపార్టుమెంటువారు చూశారట.

ఎర్రజార... అతి మామూలు గుహ కాదు. రెండువందలమంది ఏకకాలంలో సందర్శించగలిగేంత విశాలమయిన ఈగుహను సందర్శించడానికి పాతపాడు- యాగంటి మీదగా రోడ్డువేస్తే నిస్సందేహంగా ఇదొక యాత్రాస్థలమవుతుంది.

**- నడింపల్లి వి.బి.ఎస్.దత్తు**

( కథ... 7వ పేజీ తరువాయి)

మనిద్దరికోసం ఫస్ట్‌క్లాసులో టికెట్స్ బుక్
చేయించాను."
దేవిక టైము చూసుకుంది.
ఐదున్నర...
అరగంటలో ట్రెయిన్‌స్టార్ట్ అవుతుంది....
వేసవికాలపు చల్లని **ఉదయం**-
చాలా హాయిగా ఉండా**లి.**
కానీ దేవికకి ఒళ్లంతా కాలిపోతున్నట్టుంది.
"నాంపల్లి పోనియ్యి...."
ఆటో స్టార్ట్ చేశాక తను....
"దేవీ నీ చెప్పేది...."
"వినీత్- ప్లీజ్ నన్ను ప్రశాంతంగా
వెళ్లనియ్యి."
"నా ప్రవర్తనతో నిన్ను బాగా విసిగించాను.
ఐయామ్ సారీ-"
మనసంతా వికలమయినట్టు వినీత్
మొహమే చెబుతోంది-
"నాకు పదిహేనున ఇంటర్వ్యూ
తిరిగి నైన్‌టీన్త్ వరకు వచ్చేస్తాను. వచ్చాక
మాట్లాడుకుందాం. నువ్వు
కలుస్తావనుకోలేదు. స్టేషన్‌లో
ఫోస్ట్‌చేద్దామనుకున్న లెటరిది-
నేను వచ్చేవరకు ఈ లెటరు చాలా
విషయాలు చెబుతుంది"
హోర్డ్ బాగ్‌లోంచీ పొడవాటి కవర్ ఒకటి
తీసి ఇచ్చింది దేవిక-
ఆటో కదిలింది....
అయోమయంగా చూస్తున్నాడు వినీత్-
ఆటో కదిలి...వేగంగా వెళ్లిపోతోంది
వినీత్ కళ్లలో పల్చని గాజు తెరలాంటి
కన్నీటిపొర- నిశ్శబ్దంగా చిట్లింది-
చాలాసేపు అలాగే నిల్చుని వెనక్కి
తిరిగాడు-
వెనక ఎవ్వరూ లేరు-
ఎందుకో శూన్యంలో నిల్చున్నట్టనిపిస్తోంది-
తనని వంటరివాణ్ని చేసి దేవిక ఎటో
వెళ్లిపోయిన భావన...
అయితే భరించలేని భావన...కూడా!
వూహా మాత్రంగానయినా క్షణకాలం కూడా
అనుభవించలేని భావన..
కవర్ ఓపెన్ చేశాడు-
వినీత్-
నా కల నిలువునా కాలిపోతున్న రోజుది!
నిజం!!
నేనిలా వొంటరిగా ఢిల్లీ వెళతానని-
ఊహించని విషయమిది-నన్ను
ఆనందడోలికల్లో తేలిపోయేలా చేసిన
స్వర్ణస్వప్నం వేరు-జరిగింది వేరు!
ఒక శూన్యంలోంచీ-ఒక రసహీన
ప్రపంచంలోంచీ నడిచి నేనొక్కదాన్నే
వెళ్లిపోతున్నప్పుడు కలిగే బాధతో
వెళుతున్నాను-
ఇద్దరం కలసి ప్రిలిమ్స్ పాసవుతామని-
మెయిన్‌కోసం నిద్రాహారాలు మాని కష్టపడి
చదివి దాన్ని సాధిస్తామనీ-
కలసే ఇంటర్వ్యూకి వెళతామని-
ట్రెయిన్‌లో ఎదురెదురు సీట్లో
కూర్చుంటామని-
ఖాజీపేటలో ఆగినప్పుడు కలసి టిఫిను-
ప్లాట్‌ఫాంమీది వేడివేడి పెసరెట్లు,
బల్లార్షాలో లంచ్....
నాగపూర్‌లో సంత్రాలు వొలుచుకుని
తింటూ-
చంబల్ అడవుల్లోంచీ
వెన్నెల్లో తడుస్తూ పరుగెత్తుతూన్న రైలు
కిటికీలోంచీ-
అడవిపూల అందాల్ని కళ్లు నొప్పెట్టేలా
చూసిచూసి-
ఇక...అలసి నీ వొడిలో వాలి
నిద్రపోవాలని-
ఎన్ని కలలు... ఎన్నెన్ని ఆశలు....
ఏమీ జరగలేదు. నథింగ్-
ఒక శూన్యభావం...
మనమలా వెళ్లడమటుంచి-
నువ్వు ప్రిలిమ్స్ కూడా
పాసవ్వకపోవడం....
ఇంకెక్కడ...
అసలు- ఈ పరీక్షలు పాసవ్వాలనే కాంక్షే
మృగ్యమవడం...
మన కలల్నీ ఉబుసుకుపోక కట్టుకున్న
పిచ్చుకగూళ్లలా కాళ్లతో తన్నేసినట్లు వాటిని
లక్ష్యపెట్టకపోవడం నేను భరించలేను.
నన్ను విపరీతంగా బాధపెట్టేదీ కూడా ఈ
అంశమే వినీత్!
తప్పుల్నీ వొప్పుకుంటాను
వైఫల్యాల్నీ ఒప్పుకుంటాను....
నిన్ను ప్రేమిస్తున్నాను..
ఇంకా...మనఃపూర్వకంగా ప్రేమిస్తున్నాను.
తప్పుల్ని సరిదిద్దుకుని-
వైఫల్యాల్ని విజయాలుగా
మలుచుకోగలిగితే-
ప్రాణంలాంటి- నా ప్రేమికుడు-
పంచప్రాణాల కంటే ఎక్కువ.
వినీత్....
ప్రేమంటే...
నీ ఆరడుగుల ఎత్తునీ
అందమయిన రూపాన్నీ
నీ సెన్సాఫ్ హ్యూమర్నీ...
నీ సహచర్యాన్నీ
నీ వార్మ్‌హగ్‌నీ-
నీ తియ్యని ముద్దునీ- ఇష్టపడటమే
కాదు...
జీవితాన్ని కూడా ప్రేమించడం!
జీవితంలో భాగమయిన ప్రతి అంశాన్నీ
ప్రేమించడం.
అయితే-
వైఫల్యాల్ని మరోసారయినా గెలవడానికి
దాన్నో పాఠంలా స్వీకరించే సహచర్యం
నాకిష్టం...
అంతేగానీ-
వోటమిని కూడా తేలిగ్గా తీసుకుని-
గెలుపు రుచి తెలీని మనిషితో జీవితం ఎలా
ఉంటుంది?
వినీత్-
నిన్ను మనఃపూర్వకంగా అర్థించేది ఒకటే-
మరో అవకాశం ఉంది నువ్వు ప్రిలిమ్స్
పాసవడానికీ-
ఇది చివరి అవకాశం!
అఖరిపోరాటం - యుద్ధభూమిలో
యోధునిలా -
పోరాడు-
పోరాడి గెలువు. కనీసం గెలుస్తాననే
ఆత్మవిశ్వాసాన్నయినా గుండెల్నిండా
నింపుకో! వినీత్- ఇదేమీ మన ప్రేమకు
పరీక్ష కాదు. జీవనపోరాటంలో వ్యక్తిత్వాన్నే
ఆయుధంగా మలుచుకుని ధ్యేయాల్నీ
ఆశయాల్నీ సాధించాలనీ మనసారా
ఆకాంక్షిస్తున్న నీ ప్రియురాలి ఆర్తిగీతం
మాత్రమే. సెలవా మరి.

- దేవిక